# నత్తనడకన రహదారి పనులు

- రెండేళ్లుగా సాగని వైనం
- నిధులు మంజూరైనా పనులెప్పుడో?


అధ్వానంగా ఉన్న అయిభీమవరం–చెరుకుమిల్లి రహదారి

**ఆకివీడు:** చెరుకుమిల్లి రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కలవపూడి–గణపవరం (కేజీ) రహదారి పునర్నిర్మాణానికి నిధులు మంజూరు అయినప్పటికీ ఏలూరుపాడు–చెరుకుమిల్లి గ్రామాల మధ్య రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు రెండేళ్లుగా కొనసాగలేదు. రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు జరుగుతాయని ప్రజలు ఎదురు చూస్తుంటే వారి ఆశలు అడియాశలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులతో అయిభీమవరం, ఆకివీడు, గుమ్ములూరు, చినకాపవరం వరకూ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు పూర్తి చేశారు. అయిభీమవరం నుంచి చెరుకుమిల్లి గ్రామం మీదుగా ఏలూరుపాడు వంతెన వరకూ రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. పనులు ఎప్పటికీ చేపట్టకపోవడంతో నిధులు మురుగుపోతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**వర్షా కాలం తరువాత ప్రారంభిస్తామన్న అధికారులు**

ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం వర్షాలు వెళ్లిన తరువాత పనులు మొదలు పెడతామని చెప్పినప్పటికీ నేటికీ పనులు మొదలు పెట్టలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోడ్డు నిధులను ఇతర పనులకు మళ్లించి ఉంటారన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. గతంలో అయిభీమవరం రోడ్డులో రిటర్నింగ్ వాల్‌కు, ఆకివీడు ఎస్‌హెచ్ రోడ్డు వద్ద అయిభీమవరం టర్నింగ్‌లో మూలలంక బోదె బాక్సు డ్రెయిన్ మళ్లింపు పనులకు ఈ నిధులు కేటాయించి ఉంటారనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా నిధులు వినియోగించకపోవడమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాజకీయ పలుకుబడి లేకపోవడం వల్లే తమ రోడ్డు పనులు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. నంబర్ 165 జాతీయ రహదారి ఆకివీడు నుంచి జువ్వలపాలెంలోని స్టేట్ హైవే రహదారికి, కోస్తా కారిడార్ రహదారికి అనుసంధానంగా ఈ రోడ్డు ఉందని, విజయవాడ, మచిలీపట్నం వైపుకు వెళ్లేందుకు బైపాస్ రోడ్డుగా ఉన్న కేజీ రోడ్డులోని రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### పనులు తక్షణం పూర్తి చేయాలి



గత కొంతకాలంగా రోడ్డు నిర్మాణం నిలిచిపోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు పలు అవస్థలకు గురవుతున్నారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణం చేపట్టి విస్తరణ పనులు పూర్తి చేయాలి. నిధులు మంజూరై చాలా కాలం అయినప్పటికీ పనులు సాగకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది.

–ఎరుచెర్ల సాంబర్లిన్, చెరుకుమిల్లి

## క్లుప్తంగా

### ఘనంగా పందిరి రాట పూజలు


పందిరి రాట పూజలు చేస్తున్న దృశ్యం

**భీమవరం(ప్రకాశం చౌక్):** పట్టణంలో వేంచేసియున్న శ్రీభీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహా శివరాత్రి కల్యాణ మహోత్సవాల సందర్భంగా సోమవారం దేవస్థానంలో పందిరి రాట పూజలు ఘనంగా చేశారు. దీంతో శివరాత్రి మహోత్సవాల పనులకు శ్రీకారం చూట్టారు. కార్యక్రమంలో దేవస్థాన కార్య నిర్వహణ అధికారి తోట శ్రీనివాసరావు, అర్చకులు పాల్గొన్నారు.

### శారదామాతకు అభిషేకం

**భీమవరం (ప్రకాశం చౌక్):** స్థానిక రెస్ట్ హౌస్ రోడ్డులోని శ్రీశారద మాత అమ్మవారికి వసంత పంచమి సందర్భంగా మహా కుంభమేళ నదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చకులు శారదాంబ అమ్మవారికి 21 విశేష ద్రవ్యాలతోనూ, గంగా, యమున, సరస్వతి సంగమ నదీ జలాలతోనూ అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, సహస్ర పుష్పార్చన నిర్వహించారు. 165 మంది విద్యార్థులచే సరస్వతీ పూజ నిర్వహించి విద్యార్థులకు విద్యా సామగ్రి అందించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### గ్రామాభివృద్ధికి సహకరించండి


శ్రీనివాసరాజుతో మాట్లాడుతున్న పెద్దలు

**ఉండి:** పెదపుల్లేరులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, గ్రామాభివృద్ధికి సహకరించాలని కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను గ్రామ పెద్దలు కోరారు. సోమవారం పెదపుల్లేరులో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రిని కలిసిన గ్రామ పెద్దలు గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి సహకరించాలని కోరినట్టు తెలిపారు.

### అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయం

**ఉండి:** సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) పోరాడుతుందని మండల కార్యదర్శి మాదాసి గోపి అన్నారు. సోమవారం మండలంలోని పాందువ్వలో గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మి చేతుల మీదుగా కేవీపీఎస్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సచివాలయ అధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

**భీమవరం(ప్రకాశం చౌక్):** భీమవరం డిపోలో పని చేస్తున్న మెకానిక్ యూవీ రావు అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తివేసి, విధుల్లోకి తీసుకోవాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం భీమవరం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మెకానిక్‌ను విధుల్లోకి తీసుకోకపోతే ఆరో తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు చేయనున్నట్లు ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు సంబంధించి ఉద్యోగుల అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరాజు జోనల్ నాయకులు, జిల్లా కార్యదర్శి వైవీరావు డిపో సెక్రటరీ ఎస్‌ఆర్ బాబు, ఎం.నాగబాబు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన సదస్సు

**భీమవరం:** ఆక్వా సాగులో రొయ్యలు, చేపలకు బీమాపై రైతులకు అవగాహన కల్పించడానికి నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) సహకారంతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసినట్లు ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్ఎల్ఎన్ రాజు సోమవారం విలేకరులకు చెప్పారు. ఉండి మండలం వాండ్రం గ్రామంలోని ఆక్వా ట్రేడర్స్ అసోసియేషన్ భవనంలో మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తారన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ద్రోహం

**భీమవరం అర్బన్:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి మరోసారి ద్రోహం చేశారని సీపీఎమ్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ విమర్శించారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో సోమవారం కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లోనైనా విభజన హామీలు, పోలవరం, రాజధానికి నిధులు కేటాయిస్తారని ఆంధ్రప్రదేశ్ ప్రజలు భారీ ఆశలతో ఉంటే అడియాశలు చేశారన్నారు. తిరుమాని సూర్యనారాయణ, వేగి ప్రసాద్, సానబోయిన సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**బడ్జెట్‌లో విద్యారంగ కేటాయింపులు నిరాశజనకం**

**భీమవరం:** కేంద్ర బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు మరింత పెంచాల్సిందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ మొత్తంలో ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు ఆశాజనకంగా లేవన్నారు.

## విద్యా గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు

**భీమవరం(ప్రకాశం చౌక్):** శ్రీపంచమి సందర్భంగా శ్రీవిద్యా గణపతి ఆలయంలో సాయంత్రం విద్యార్థినీ, విద్యార్థులచే భక్తుల సహకారంతో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు.

## ఎస్ఆర్‌కేఆర్‌లో జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం

**భీమవరం:** ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 15, 16 తేదీల్లో సంకేత 2025 జాతీయ స్థాయి విద్యార్థి సింపోజియం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు చెప్పారు. అసోసియేషన్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే సింపోజియం పోస్టర్ ఆవిష్కరణ సందర్భంగా ఆయన వివరాలను వెల్లడించారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ కె.సురేష్‌బాబు మాట్లాడుతూ ఐఐటీ పాల్కడ్‌లోని మెకానికల్ విభాగం హెడ్ దినేష్ శెట్టి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. రోబోటిక్స్ వర్క్ షాప్‌తో పాటు పలు ఈవెంట్లు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

## సరస్వతీదేవిగా బాలాత్రిపుర సుందరీదేవి

**భీమవరం (ప్రకాశం చౌక్):** వసంత పంచమి సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరి అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ యాతం శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులచే అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, హోమం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు


కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

**భీమవరం(ప్రకాశం చౌక్):** శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 61వ వార్షికోత్సవ మహోత్సవంలో సోమవారం సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలు శ్రీతాండవ నృత్య నికేతన్ భీమవరం వారిచే ప్రదర్శించబడిన కూచిపూడి జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం అమ్మవారి ఉత్సవ కమిటీ ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబరాన్నంటిన ఇలవేల్పు సంబరం


అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సెట్టింగ్స్, లైటింగ్స్ శ్రీమావుళ్లమ్మ అమ్మవారు

**భీమవరం(ప్రకాశం చౌక్):** భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 61 వార్షిక మహోత్సవాలు వైభవోపేతంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు ఈనెల 13న ప్రారంభం కాగా వచ్చే నెల 14వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ మహోత్సవాల్లో అమ్మవారిని దర్శించి తరించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండడంతో అమ్మవారి దేవస్థాన ప్రాంతం జనసంద్రం తలపిస్తోంది. భక్తులకు ఉత్సవాల నిర్వాహకులు నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దేవస్థానం వద్ద భోజన ప్రసాదం సౌకర్యం కల్పిస్తున్నారు. రోజుకు 800 నుంచి 1000 మందికి అన్నప్రసాద వితరణ జరుగుతోంది.

**ఆకట్టుకుంటున్న సెట్టింగ్‌లు**

ఉత్సవాల సందర్భంగా మావుళ్లమ్మ దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు, సెట్టింగ్‌లు ఆకట్టుకుంటున్నాయి. అలాగే ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనలు సైతం అలరిస్తున్నాయి. ప్రతి రోజు సాయంత్రం నుంచి రాత్రి 10 గంటల వరకు భజనలు, కూచిపూడి, భరతనాట్యం, హరికథలు, బుర్రకథలు, మ్యూజికల్ నైట్స్, నాటకాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

## ప్లాస్టిక్ వినియోగంతో అనారోగ్యం


ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న సీఐ నాగరాజు

**భీమవరం:** ప్లాస్టిక్ వినియోగించడం వలన క్యాన్సర్ వ్యాధి ప్రబలుతుందని అందువల్ల ప్లాస్టిక్ నిషేధాన్ని బాధ్యతగా తీసకోవాలని భీమవరం వన్ టౌన్ సీఐ ఎం.నాగరాజు అన్నారు. సోమవారం భీమవరం మున్సిపాలిటీ, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విచ్చల విడిగా ప్లాస్టిక్ వాడడం వలన వాతావరణం కలుషితమై కొన్ని రకాల వ్యాధులకు కారణమవుతుందని ప్లాస్టిక్ వలన ఏర్పడే అనర్థాలను ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఎస్సై బీవై కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మనుషులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం కూడా ఆరోగ్యకరంగా ఉంటుందని ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టి ఆరోగ్యకరమైన సమాజాన్ని సృషించాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు స్టీల్ గ్లాసులు, ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వేండ్ర వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, భీమవరం బార్ అసోసియేషన్ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఆనంద్, జి.సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 'పది' విద్యార్థులకు అవగాహన సదస్సు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గజల్ శ్రీనివాస్

**వీరవాసరం:** మద్దాల రామకృష్ణమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గజల్ శ్రీనివాస్‌చే పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు విద్య పట్ల అవగాహనను పెంచే విధంగా సూచనలు, సలహాలు అందించారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే విధంగా ప్రణాళికలు రచించుకోవాలని, ఉన్నత స్థాయి సాధనే గమ్యంగా ప్రయత్నం కొనసాగించాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై గౌరవ మర్యాదలతో మెలగాలని సూచించారు. విద్యార్థులలో ప్రేరణ కలిగించే గజల్ శ్రీనివాస్ పాడి వారిలో నూతన ఉత్సాహాన్ని నింపారు. పాఠశాల పూర్వ విద్యార్థి గుండా రామకృష్ణ మాట్లాడుతూ 175 సంవత్సరాల చరిత్ర కలిగిన పాఠశాలలో చదువుకోవడం అదష్టమని, దానిని సద్వినియోగం చేసుకొని రాబోయే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సంవత్సరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి పూర్వ విద్యార్థి సంఘం తరపున రూ.10 వేల నగదు బహుమతిని అందజేస్తామని ప్రకటించారు. వీరవాసరం ఎస్సై రాజ్‌కుమార్ మాట్లాడుతూ గజల్ శ్రీనివాస్ వంటి గొప్ప వ్యక్తుల సందేశం లభించడం అదృష్టమని, వారి మాటలు పాటించి ఉన్నత స్థానాలను చేరుకోవాలన్నారు. వీరవల్లి రామకృష్ణ, బాజింకి కృష్ణారావు, మతల కాశీ విశ్వేశ్వరరావు, బోను రామకృష్ణ, పాలా ఆంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోవులను రక్షించాలని వినతి


వినతిపత్రం స్వీకరిస్తున్న హైందవ శంఖారావం సభ ప్రతినిధులు

**ఆకివీడు:** రోడ్లపై తిరుగుతున్న ఆవులను, ఆబోతులను రక్షించేందుకు ద్వారకా తిరుమల దేవస్థానం సహకరించాలని ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్ కె.కృష్ణమోహన్ వినతి పత్రం పంపారు. ఈ మేరకు హైందవ శంఖారావం ఆకివీడు శాఖ ప్రతినిధులకు వినతి పత్రాన్ని సోమవారం కమిషనర్ అందజేశారు. ఈ వినతి పత్రాన్ని ద్వారకా తిరుమల ఈఓకు అందజేస్తామని శంఖారావం సభ గౌరవ ధ్యక్షుడు భమిడిపాటి సూర్యభాస్కరరావు అధ్యక్షుడు లంకా జలదుర్గా ప్రసాద్ చెప్పారు. గత కొన్నేళ్లుగా ఆవులను, ఆబోతులను రోడ్లపైకి వదిలి వేస్తున్నారని చెప్పారు. వీటి వలన వాహన చోదకులకు, ప్రయాణికులకు, ద్విచక్ర వాహనదారులకు ఇబ్బంది కల్గడమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నాయన్నారు. వాటి రక్షణ నిమిత్తం ద్వారకా తిరుమల గోశాలకు దేవస్థానం సొంత ఖర్చులతో తరలించే విధంగా సహకరించాలని కమిషనర్ వినతి పత్రం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాక్షుడు యర్రా రఘు, కార్యదర్శి నెల్లి సతీష్, అమన్నమంచి నారాయణ, చొప్పెర్ల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఈ–పంట సూపర్ చెక్


ఈ–పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ

**ఆకివీడు:** ఈ–పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని, సూపర్‌వైజింగ్ చేస్తున్నామని ఏడీఏ కేఎస్ఎస్ శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని సిద్ధాపురం, చినకాపవరం, కోళ్లపర్రు, చినమిల్లిపాడు, చెరుకుమిల్లి, అయిభీమవరం గ్రామాల్లో ఈ–పంట నమోదును ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడీఏ పరిధిలో దాళ్వా నాట్లు పూర్తయ్యాయని చెప్పారు. ఏడు స్థాయిల్లో ఈ–పంట నమోదు పరిశీలన జరుగుతుందన్నారు. కలెక్టర్, ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్, తహసీల్దార్, ఎంఏఓ, ఏడీఏ, డీఏఓలు రికార్డులను, ఫీల్డ్‌లో పరిశీలన చేస్తారన్నారు. పంట నమోదును ప్రాథమిక స్థాయిలో లోపాలుంటే సరిజేసే అవకాశం ఉందన్నారు. సోషల్ ఆడిట్‌లో అన్ని రకాల లోపాలను సరిజేసి, పూర్తి జాబితాను ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. పంట నమోదు ద్వారా రైతులకు ప్రకృతి వైపరీత్యాల వలన జరిగే నష్టాన్ని, సబ్సిడీలను, రాయితీలను పొందొచ్చన్నారు. ఈ–పంట నమోదు చేయించుకోకపోతే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఇబ్బంది పడాల్సి వస్తుందని తెలిపారు. సూపర్ చెకింగ్‌ల ద్వారా పండించిన పంట రకాలు, సర్వే నంబర్, రైతు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తామని ఏడీఏ శ్రీనివాస్ వివరించారు.

### కనుల పండువగా పెద్దింట్లమ్మ కల్యాణం


పెద్దింట్లమ్మ కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

**ఆకివీడు:** అమ్మలగన్న అమ్మ పెద్దింట్లమ్మ కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అంగరంగ వైభవంగా నిర్వహించిన అమ్మవారి కల్యాణోత్సవాన్ని కనులార్పకుండా తిలకించారు.జలదుర్గ (పెద్దింట్లమ్మ) శక్తీశ్వరస్వామి వార్లను వధూవరులుగా అలంకరించారు.పెద్దింట్లమ్మ ఆలయంలో సోమవారం రాత్రి నిర్వహించిన కల్యాణోత్సవాన్ని భక్తులు తిలకించారు. అర్చకులు మొవ్వ చంద్రధర్ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. మంగళవారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తామని ఆలయ కార్య నిర్వాహణాధికారి సత్యనారాయణరాజు చెప్పారు.

## అభివృద్ధి పనులకు భూమి పూజ


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న హెచ్‌ఎం

**పాలకోడేరు:** పూర్వ విద్యార్థుల సహకారంతో కెనరా బ్యాంకు సౌజన్యంతో రూ.14 లక్షలతో పాఠశాల అభివృద్ధికి తన చేతుల మీదుగా భూమి పూజ చేయడం చాలా ఆనందంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీవీ సత్యనారాయణరాజు అన్నారు. గొల్లలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గత నెల 12వ తేదీన 1986–1991 పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అదే పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి సుబ్బలక్ష్మి భర్త కెనరా బ్యాంకులో మంచి పొజిషన్‌లో ఉన్నారు. ఆయన సహకారంతో పాఠశాల అభివృద్ధికి రూ.14 లక్షల కెనరా బ్యాంకు ద్వారా నిధులు మంజూరు చేయించారు.ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఎంతో మంది పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకుంటున్నారు. కానీ మీ బ్యాచ్ పాఠశాల అభివృద్ధికి ఇటువంటి సహకారం మీ ద్వారా రావటం ఈ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు అదృష్టమన్నారు. ఈ నిధులు రావడానికి సహకరించిన పూర్వ విద్యార్థులు సుబ్బలక్ష్మి, ఆమె భర్తకు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ స్వామి పూర్వ విద్యార్థులు ఎం.విజయ ప్రసాద్, పెరుమాళ్ల శ్రీనివాస్, మర్రి శ్రీనివాస్, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

### బాలిక ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

**ఆకివీడు:** పేద కుటుంబంలో జన్మించి, మెదడు వ్యాధితో బాధపడుతున్న 14 ఏళ్ల బాలిక ఆపరేషన్ నిమిత్తం ఆర్థిక సాయాన్ని స్థానిక పిల్లల వైద్యులు కలిదిండి మహేష్ వర్మ సోమవారం అందజేశారు. మానవతా దృక్పథంతో బాలిక ఆరోగ్యం మెరుగు పడాలనే ఆశయంతో పెద్దపుల్లేటి రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10 వేలు, యోహాన్ కాఫీ లిమిటెడ్ డైరెక్టర్ పెన్మెత్స సుందర రామరాజు రూ.10 వేలు నగదును అందజేయడం అభినందనీయమన్నారు. మొత్తం సొమ్ము రూ. 20 వేలు బాలిక తల్లిదండ్రులు కదలి శ్రీనివాస్, నాగలక్ష్మిలకు అందజేశారు.